ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts
సంపుటి - 03 సంచిక -90 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం19 జులై 2026

# 'విక్రమ్-1'ప్రయోగం విజయవంతం



- భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం
- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది పూర్తి చేసిన షార్
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు

2లో.



# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన



- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించిన కేంద్రం
- ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా యామి గౌతమ్
- తెలుగులో పలు విభాగాల్లో సత్తా చాటిన 'పుష్ప 2', 'ఖల్కి', 'కమిటీ కుర్రోళ్లు'
- ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా 'ఆర్టికల్ 370', ఉత్తమ వినోదాత్మక చిత్రంగా 'ఖల్కి'
- ఉత్తమ దర్శకుడిగా 'అమరన్' చిత్రానికి రాజ్ కుమార్ పెరియసామి



**న్యూఢిల్లీ,జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ **మిగతా 2లో...**

# గోదావరిలో విషాదం..

## చేపలు పట్టేందుకు వెళ్లి ఐదుగురు గిరిజనుల మృతి



- చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి
- పోలవరం జిల్లా ఎటపాక లో విషాదకర ఘటన
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్

**పోలవరం జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. **మిగతా 2లో...**

# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం



- చెత్తనుంచి సంపద సృష్టించడమే మా లక్ష్యం
- తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలి
- ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు
- రౌడీయిజం చేసేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక
- గుడివాడ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు

**గుడివాడజూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్రంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి చెత్తలేకుండా చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. **మిగతా 2లో...**




# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

- హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం
- సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స



2లో.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం




- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. **మిగతా 2లో...**

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్,జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్థీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్
- బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు

**హైదరాబాద్,జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది **మిగతా 2లో...**





# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

**మొదటిపేజీ తరువాయి**

గుంటూరు, నెల్లూరు నగరాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే.. ఎలక్ట్రిక్ ఆటోలను వర్చువల్‌గా ప్రారంభించారు. బాగా పని చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇంట్లో ఎవరికి వారే.. తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేపట్టాం. ఆగస్టు 26 నాటికి 1140 ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయి. 108 సమగ్ర ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 'ప్రజారథం' కార్యక్రమం ద్వారా చెత్తను కొనుగోలు చేసి.. నిత్యావసర వస్తువులు అందజేశాం. దీనికోసం ఇప్పటి వరకు రూ.16 కోట్లు ఖర్చు చేశాం. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు అన్నారు. ఎవరి ఇంటిపై వాళ్లే కరెంటు తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏపీలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని చెప్పారు. ఈ నెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తామని వెల్లడించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమృత్ 2.0 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గొడ్డలి పార్టీతో పెద్ద సమస్య వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్‌గా మారారని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ చేస్తే ఓ వ్యక్తి చనిపోయాడని తెలిపారు. పోస్టర్లు, కటౌట్‌లకు పొట్టేళ్లను బలి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ లక్ష్యం ప్రజలను దోపిడీ చేయడమేనని విమర్శించారు. తన జీవితంలో ఇలాంటి రాజకీయాలు చూడలేదని అన్నారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇదిలావుంటే రాష్ట్రాభివృద్ధిలో మేము సైతం అంటూ కొందరు ఉదారతను చాటారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు తమ వంతు విరాళాలను అందించారు. అమరావతి కోసం గుడివాడకు చెందిన సాయిశ్వేత బంగారు గాజులు అందించారు. ఆమె కుమారుడు దాచుకున్న కిడ్డీ బ్యాంక్ నగదును కూడా అమరావతి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. మరోవైపు గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ.3 కోట్ల విరాళం ఇచ్చారు. గతంలోనూ వారు గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి రూ.3 కోట్లు విరాళం ఇచ్చారు.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం

**మొదటిపేజీ తరువాయి**

ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు.ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# 'విక్రమ్-1'ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట,జులై 18 (రిపబ్లిక్ న్యూస్):** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది.ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు.

ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

**మొదటిపేజీ తరువాయి**

నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

# గోదావరిలో విషాదం..

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరఫున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

## హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం

## సప్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స

**న్యూఢిల్లీ,జులై 18 (రిపబ్లిక్ న్యూస్):** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహారదీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శపోలీసులు బలవంతంగా శనివారం ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తగిన వైద్యసహాయం అందించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నిరసన ప్రాంతం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆయన్ను సప్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తోన్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించా లని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నామని ఢిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్సా అందించొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో డిమాండ్ చేశారు. ఆయన సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతిలేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతిఒక్కరిని బాధ్యుల్ని చేస్తాను. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీలు లేదు. అది మా హక్కు అని మీడియాతో మాట్లాడారు.

### వాంగ్‌చుక్ తరలింపుతో దీక్షకు దిగిన దీప్కే

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం అని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ పార్టీ తొలుత ఢిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న పార్లమెంట్‌కు శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు కాక్రోచ్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సప్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

**మొదటిపేజీ తరువాయి**

అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి



మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

రిపబ్లిక్



# పిల్లల సంరక్షణకు కృషి

## జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఐసిడిఎస్ పిడి విజయ




**కర్నూలు ,జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలోని 18 సంవత్సరాలలోపు పిల్లల సంరక్షణకు కృషి చేస్తామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి, పి. విజయ తెలిపారు. కలెక్టర్ వారి కార్యాలయంలోని శనివారం జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ -1098 కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న బాలబాలికలకు రక్షణ మరియు సంరక్షించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ -1098 టోల్ ఫ్రీ నెంబర్, 24/7 గం,, లు ఉచితంగా పని చేస్తుందన్నారు. ఏ క్షణంలోనైనా ఎలాంటి ఆపద వచ్చిన వెంటనే 1098కి ఫోన్ చేస్తే ఆపదలో ఉన్నవారిని రక్షించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరుస్తామన్నారు. తరువాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నిర్ణయం మేరకు పిల్లలకు రక్షణ.. సంరక్షణ లేదా విద్యావకాశాలు



కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డిసిపిఓ టి.శారద మాట్లాడుతూ జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్-1098 కి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నియమనిబంధనల మేరకు పని చేస్తామన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ నిర్వహణకు సంబంధించి అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం నియమించిందన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది సమిష్టిగా విధులు నిర్వర్తించి జిల్లాలో బాల, బాలికలకు రక్షణగా నిలుస్తామని తెలిపారు. అనంతరం జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్-1098 కోఆర్డినేటర్ డి. సుంకన్న మాట్లాడుతూ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, వీధి బాలలు, తప్పిపోయిన పిల్లలు, అనాథలు, వేధింపులకు గురైన పిల్లలు, ప్రమాదంలో ఉన్న పిల్లలు వంటి ప్రతి చిన్నారి సంక్షేమానికి జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నిరంతరం సేవలందిస్తోందని తెలిపారు. పిల్లలకు సంబంధించిన అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే 1098కు సమాచారం అందిస్తే సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ చర్యలు తీసుకొని పిల్లలకు రక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది కౌన్సిలర్, సూపర్వైజర్లు, కేస్ వర్కర్లు పాల్గొన్నారు.

## నగరడోన గ్రామంలో వనం మనం కార్యక్రమం

### ముఖ్య అతిథులుగా సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప






**చిప్పగిరి, జూలై, 18,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి మండలం నగరడోన గ్రామంలో శనివారం వనం మనం కార్యక్రమం గ్రామ సంఘం అధ్యక్షులు మంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, వెలుగు సిసి శ్రీనివాసులు పాల్గొన్నారు, వెలుగు సిసి మాట్లాడుతూ వెలుగు ఏపీఎం నాగార్జున ఆదేశాల మేరకు మారుతి, మరియు సూర్యోదయం, గ్రామ సంఘాల కి నేరేడు, ఉసిరి, బొప్పాయి, బాదం, చెట్లు మొత్తం 120 చెట్లు వచ్చాయని, రాబోయే సంవత్సరాల్లో రాష్ట్రంలో చెట్ల శాతం గణనీయంగా పెంచి కాలుష్యాన్ని తగ్గించాలని, ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం అయ్యేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు, ఈ కార్యక్రమంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు ఆనంద్, సౌమ్య, గ్రామ సంఘం కార్యదర్శి రాజమ్మ, ఈనారీలు కళావతి, మల్లేశ్వరి, ఐ సి ఆర్ పి లు రంగయ్య ,అరుణ, రామదుర్గం తిమ్మయ్య, కోనంకి గోపాల్, సొట్టన్న గారి నాగన్న,ఉప్పర గోపాల్, బోయ వంద్రప్ప, బోయ మల్లయ్య, వసాలి శ్రీరాములు, దుబ్బన్న గారి ఈరన్న, డీలర్ సోమశేఖర్, మాదిగ మల్లికార్జున, వసాలి రమేష్, రఘునాథ్, డీలర్ రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## అస్పరి లో 25 న జరుగు ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి

### మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప




**చిప్పగిరి, జూలై, 18,( రిపబ్లిక్ న్యూస్)** ఈనెల 25వ తేదీ ఆస్పరి లో జరుగు ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, మాజీ జెడ్పిటిసి మీనాక్షి నాయుడు, సాగునీటి అధ్యక్షుడు కిష్టప్ప పిలుపునిచ్చారు, మండల కన్వీనర్ మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకే ఈ కార్యక్రమం నిర్వహించామని, ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు అవసరమైన కార్యచరణ నిర్ణయం తీసుకున్నామని, ప్రతి గ్రామం నుండి సీనియర్ కార్యకర్తలు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, కాల్వ ప్రెసిడెంట్లు, క్లస్టర్లు, యూనిట్లు గ్రామ పార్టీ అధ్యక్షులు, వైకుంఠ అభిమానులు, అందరూ పెద్దఎత్తున సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు తిమ్మయ్య, కాజీపురం ఓబయ్య, సంఘాల చంద్ర, భాస్కర్ ,క్లస్టర్ ఇంచార్జ్ ప్రభాకర్, జనార్దన్ స్వామి, బోగేస్ స్వామి, నంచర్ల తిమ్మప్ప, బెల్డోన కోనంకి శ్రీనివాసులు ,రామదుర్గం రామచంద్ర, బెల్డోన మాజీ ఎంపిటిసి వెంకటేశ్వర్లు, వైకుంఠం దినేష్, ఏరూరు నరసింహులు, చిప్పగిరి అశోక్ యాదవ్, కాల్వ ప్రెసిడెంట్ దానప్ప ,తదితరులు పాల్గొన్నారు.



## రైతులందరూ బెల్డోన సొసైటీ ద్వారా ఎరువులు తీసుకోండి

### సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, సీఈఓ హరికృష్ణ

**చిప్పగిరి, జూలై, 18,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి బెల్డోన ప్రాథమిక వ్యవసాయ సంఘం మార్క్ఫెడ్ ద్వారా డిఏపి 240 బస్తాలు, యూరియా 240 బస్తాలు వచ్చాయని, ఆసక్తి ఉన్న చిప్పగిరి మండల రైతులు సొసైటీ ద్వారా ఎరువులు తీసుకోవాలని శనివారం సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, సీఈవో హరికృష్ణ, పిలుపునిచ్చారు.



## నాయకులు కార్యకర్తలు 2.0 యాప్ ను డౌన్లోడ్ చేసుకోండి

### ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి





**చిప్పగిరి, జూలై, 18,( రిపబ్లిక్ న్యూస్)** వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు 2.0 యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి పిలుపునిచ్చారు, శనివారం చిప్పగిరి మండల పార్టీ కేంద్ర కార్యాలయంలో 2.0 సూపర్ యాప్ ను ఆవిష్కరించడం జరిగింది, ఎమ్మెల్యే బుసినే వీరుపాక్షి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు మరియు ప్రజలను ఒకే వేదికపై అనుసంధానించే విధంగా జగనన్న 2.0 యాప్ను రూపొందించ బడింది అని, ఈ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలు తాజా సమాచారం సభ్యత్వం ప్రజా సమస్యలు నమోదు పార్టీ కార్యకలాపాలకు సంబంధించిన పలు సేవలు సులభంగా అందుబాటులో ఉంటాయని, డిజిటల్ సంకేతకను సమర్థంగా వినియోగించుకుంటూ పార్టీని మరింత బలోపేతం చేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు ఎప్పటికప్పుడు చేరువగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని స్పందించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని, రాబోయే రోజుల్లో పార్టీ నిర్వహించే కార్యక్రమాలు ప్రజా ఉద్యమాల్లో జగనన్న 2.0 యాప్ ప్రధాన వేదికగా నిలుస్తుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లికార్జున, సురేష్ రెడ్డి, సర్వర్ ఖాన్, నంచర్ల శేఖన్న, మహానంది, ఓబులేసు, నేమకల్ మాజీ సర్పంచ్ ప్రేమ్ కుమార్, నియోజకవర్గ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## చిప్పగిరి గ్రంథాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర

### ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కట్టం ప్రకాష్




**చిప్పగిరి, జూలై, 18,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి స్థానిక గ్రంథాలయం నందు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమం గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కట్టం ప్రకాష్ పాల్గొన్నారు, గ్రంథాలయ ఆవరణలో చెట్లునాటి ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని విద్యాసంస్థలు గ్రంథాలయాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు, అనంతరం కార్యదర్శి రికార్డులను పరిశీలించారు, ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేరస్థులకు శిక్షే లక్ష్యం.. సమన్వయంతో కేసుల పురోగతిపై పనిచేయాలి

### ఈ-ప్రాసిక్యూషన్, డిజిటల్ సాక్ష్యాల నిర్వహణపై సమీక్ష నిర్వహించిన అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా

### ఏపీపీలు, పీపీలు, పోలీసు అధికారులకు కీలక సూచనలు

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 18)** నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా కేసుల దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని కర్నూలు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఈ-ప్రాసిక్యూషన్ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో కేసుల దర్యాప్తు పురోగతి, చార్జ్‌షీట్లను సకాలంలో ఈ-ప్రాసిక్యూషన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, ఈ-కాప్స్, ఈ-సాక్ష్య యాప్‌ల వినియోగం, డిజిటల్ సాక్ష్యాల నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. కేసుల విచారణ వేగవంతం కావడానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.





ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, కేసుల దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచడంతో పాటు కోర్టుల్లో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్ నిర్వహించడం ద్వారా నేరస్థులకు శిక్షలు పడేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ విభాగం మధ్య మెరుగైన సమన్వయం ఉండాలని పేర్కొన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా దర్యాప్తు, కోర్టు విచారణ ప్రక్రియలను మరింత వేగవంతం చేయవచ్చని తెలిపారు. ఈ-ప్రాసిక్యూషన్, సీసీటీఎన్ఎస్, ఈ-కాప్స్, ఈ-సాక్ష్య వంటి డిజిటల్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లాలోని 11 మంది అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (ఏపీపీలు), పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పీపీలు), డీసీఆర్బీ సీఐ గుణశేఖర్ బాబు, కోర్టు మానిటరింగ్ సీఐ రామయ్య నాయుడు, సీసీటీఎన్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జూలై 25న ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటన.. భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి?**
**(రిపబ్లిక్ న్యూస్ జూలై 18)**



ఈ నెల 25వ తేదీన కర్నూలు జిల్లా ఆస్పరి మండల కేంద్రంలో నిర్వహించనున్న "సంజీవని" కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆస్పరిలో భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్, బహిరంగ సభా ప్రాంగణం, వీఐపీ రాకపోకల మార్గాలు, రూట్ మ్యాప్, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్ నిర్వహణ, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.అలాగే సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు, భద్రతా చర్యలను ముందుగానే పూర్తి చేయాలని, ముఖ్యమంత్రి రాకపోకలకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ తనిఖీల్లో పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్ రావు, ఆస్పరి సీఐ శ్రీనివాస్ నాయక్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనంలో పాఠశాల నిర్వహణ

### శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే దగ్గుపాటి కి ఏఐఎస్బి వినతి

### ఏ ఐ ఎస్ బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వి

**అనంతపురం రామ్ నగర్, జూలై 18,( రిపబ్లిక్ న్యూస్):** నిర్మాణంలో ఉన్న భవనంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అఖిలభారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డి పల్లి పృథ్వి అన్నారు.
ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పాపిరెడ్డి పల్లి పృథ్వి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పాపిరెడ్డిపల్లి పృథ్వి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్ట రాజ్యాంగ విద్యాసంస్థలు నిర్వహిస్తున్న



శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి కోరారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు 8 బ్రాంచ్ లు ఉన్నాయి ఏ ఒక్క పాఠశాలలో కూడా శ్రీ చైతన్య విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను విద్యార్థి తల్లిదండ్రులను మానసికంగా ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అంతేకాకుండా అనంతపురం నగరంలో ఉన్న పిస్తా హౌస్ హోటల్ సమీపంలో శ్రీ చైతన్య పాఠశాల భవనం నిర్మాణంలో ఉన్న ఆ భవనంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు పేర్కొన్నారు. భవనం నిర్మాణంలో ఉన్న ఆ భవనానికి విద్యాశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు.నిర్మాణంలో ఉన్న ఆ భవనం పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారిని కోరారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నాయ దందా చేస్తూ రాజ్యాంగాన్ని చట్టాన్ని ఖూనీ చేస్తూ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు అని అన్నారు.తక్షణమే శ్రీ చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గారిని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఐ ఎస్ బి నాయకులు మంజుల విష్ణు, గౌతమ్ కుమార్, ఇంతియాజ్, షాషవలి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై క్షేత్రస్థాయిలో అధ్యయనం

**జూలై 31లోపు పంట బీమా చేయించుకోవాలి: వ్యవసాయ అధికారులు**



**అనంతపురం/గుత్తి, జూలై 18: (రిపబ్లిక్ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల్లో పంటల స్థితిగతులను తెలుసుకునేందుకు ఎన్,జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం శనివారం పామిడి, పెద్దవడుగూరు, గుత్తి మండలాల్లో పర్యటించింది. గుత్తి మండలంలోని కొత్తపేట గ్రామంలో రైతులతో సమావేశమై పంటల పరిస్థితిపై అధ్యయనం చేయాల్సి ఉండగా, సమయాభావం కారణంగా బృందం అక్కడికి చేరుకోలేకపోయింది. అనంతపురం జేడీఏ సాలు రెడ్డి, గుత్తి ఏడీఏ వెంకటరాముడు, గుత్తి డివిజన్ వ్యవసాయ అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ, తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. రైతులు మీ సేవ కేంద్రాలు లేదా కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా జూలై 31లోపు పంటల బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందేందుకు పంటల బీమా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో వీఏఏ నరేంద్ర కుమార్, ఎంపీఈవో లలిత, రైతులు కిరణ్, పి. శ్రీనివాసులు, సుధాకర్, రాముడు, ప్రవీణ్ కుమార్, సి. లక్ష్మినారాయణ, కదిరిప్ప, రంగస్వామి, పెద్ద సుంకన్న, పెద్ద ఆదినారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన

**అనంతపురం/గుత్తి, జూలై 18:( రిపబ్లిక్ న్యూస్)**



ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుత్తి ఆర్ఎస్‌లోని రెహానా హైస్కూల్‌లో శనివారం బల్క్ వేస్ట్ జనరేటర్ల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. రోజుకు 100 కిలోలకుపైగా చెత్త ఉత్పత్తి చేసే సంస్థల వివరాలను నమోదు చేసే ప్రక్రియను చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ బి. జబ్బార్ మియా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అపార్ట్‌మెంట్లు, ప్రైవేటు, పబ్లిక్ మార్కెట్లు, ఫ్రూట్ మండీలు తదితర సంస్థలను బల్క్ వేస్ట్ జనరేటర్లుగా గుర్తించి నమోదు చేస్తున్నట్లు చెప్పారు. చెత్త నిర్వహణను శాస్త్రీయంగా అమలు చేయడం ద్వారా పట్టణ పరిశుభ్రతను మరింత మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, శానిటేషన్ సెక్రటరీలు, రెహానా హైస్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగన్ 2.0 సూపర్ యాప్ పోస్టర్ ఆవిష్కరణ

**డిజిటల్ వేదికగా కార్యకర్తలకు మరింత చేరువ: వై. నైరుతి రెడ్డి**

**అనంతపురం/గుంతకల్, జూలై 18 : (రిపబ్లిక్ న్యూస్ )**




గుంతకల్ పట్టణంలోని వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి ఆధ్వర్యంలో 'జగన్ 2.0 సూపర్ యాప్' పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై. నైరుతి రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించే లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగన్ 2.0 సూపర్ యాప్ ను ప్రారంభించారని తెలిపారు. గ్రామ స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు అందరినీ ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడమే యాప్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలు, సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, అధికారిక ప్రకటనలు, లైవ్ అప్‌డేట్లు, సోషల్ మీడియా ప్రచార కార్యక్రమాలు, ప్రజా సమస్యల నమోదు, నాయకత్వంతో ప్రత్యక్ష కమ్యూనికేషన్ వంటి అనేక సేవలు ఈ యాప్ ద్వారా అందుబాటులో ఉంటాయని వివరించారు. సోషల్ మీడియా ప్రచార కార్యక్రమాల్లో కార్యకర్తలు చురుకుగా పాల్గొని తమ పనితీరును నమోదు చేసుకునే అవకాశం కూడా యాప్‌లో కల్పించారని చెప్పారు. ప్రజల సమస్యలను వేగంగా గుర్తించి వాటిపై పార్టీ స్పందించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త జగన్ 2.0 సూపర్ యాప్ ను డౌన్‌లోడ్ చేసుకుని డిజిటల్ ఉద్యమంలో భాగస్వామి కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గవిమఠం పీఠాధిపతికి వై. విశ్వేశ్వర్‌రెడ్డి నివాళి



**అనంతపురం / ఉరవకొండ, జూలై 18,(రిపబ్లిక్ న్యూస్):** ఉరవకొండ పట్టణానికి ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన గవిమఠం పుణ్యక్షేత్రం 8వ ప్రధాన పీఠాధిపతి పూజ్యశ్రీ చిన్న బసవరాజేంద్ర స్వామి శివైక్యం చెందడంతో భక్తుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వై. విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం హుటాహుటిన గవిమఠానికి చేరుకుని స్వామివారి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మఠం నిర్వాహకులు, శిష్యులు, భక్తులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పూజ్యశ్రీ చిన్న బసవరాజేంద్ర స్వామి ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు ధార్మిక, సామాజిక సేవల ద్వారా అనేక మందికి మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. స్వామివారి శివైక్యం గవిమఠానికి, ఉరవకొండ ప్రాంత ప్రజలకు, వేలాది మంది భక్తులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి కొద్దిసేపు మౌనం పాటించి స్వామివారికి శ్రద్ధాంజలి ఘటించారు. భక్తులు పెద్ద సంఖ్యలో గవిమఠానికి తరలివచ్చి స్వామివారిని చివరిసారిగా దర్శించుకుని కన్నీరుమున్నీరయ్యారు. దీంతో గవిమఠం ప్రాంగణం అంతా విషాద వాతావరణం నెలకొంది.

# మార్కెట్ యార్డుకు స్థలం కేటాయింపు

**15 ఎకరాల భూమి లీజుకు అనుమతి**

**ఎమ్మెల్యే పరిటాల సునీతకు కమిటీ కృతజ్ఞతలు**



**అనంతపురం/ రాప్తాడు, జూలై 18,(రిపబ్లిక్ న్యూస్):** రాప్తాడు వ్యవసాయ మార్కెట్ యార్డు ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. శ్రీ పండమేరు వెంకటరమణస్వామి దేవస్థానానికి చెందిన 15 ఎకరాల భూమిని మార్కెట్ కమిటీకి 11 సంవత్సరాల లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న రాప్తాడు మార్కెట్ యార్డు కల సాకారం కానుంది.

**ఈ స్థలం రైతులు, వ్యాపారులకు అనుకూలం**

రాప్తాడు నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ ఉన్నప్పటికీ, సొంత మార్కెట్ యార్డు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవ తీసుకుని దేవాదాయ శాఖ అధికారులతో పలుమార్లు చర్చలు జరిపారు. అనంతరం సర్వే నంబర్ 476-3లోని 15 ఎకరాల భూమిని మార్కెట్ కమిటీకి లీజుకు కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. భూమి కేటాయింపు ఉత్తర్వులు వెలువడిన నేపథ్యంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులు, అధికారులు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మార్కెట్ యార్డు ఏర్పాటుకు కృషి చేశామని, ఇప్పుడు ఆ ప్రయత్నాలు ఫలించాయని ఎమ్మెల్యే సునీత తెలిపారు. జాతీయ రహదారి-44కు ఆనుకుని ఉండే ఈ స్థలం రైతులు, వ్యాపారులకు అనుకూలంగా ఉండటంతో పాటు గొర్రెలు, మేకల సంత నిర్వహణకు కూడా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా కమిటీ పని చేయాలని సూచించారు.

**ప్రతి మూడు సంవత్సరాలకు అద్దెపై 30 శాతం పెంపు**

మార్కెట్ కమిటీ అధికారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవ వల్లే భూమి కేటాయింపు సాధ్యమైందన్నారు. లీజు నిబంధనల ప్రకారం ప్రతి ఎకరానికి సంవత్సరానికి రూ.50 వేల చొప్పున అద్దె చెల్లించాల్సి ఉంటుందని, ప్రతి మూడు సంవత్సరాలకు అద్దెపై 30 శాతం పెంపు వర్తిస్తుందని తెలిపారు. దేవస్థాన భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన భూమిని భవిష్యత్తు అవసరాల కోసం ఉంచినట్లు వివరించారు.

# వారాదయ్య కొండపై ఏకాదశి మహోత్సవాలు

**ప్రత్యేక పూజలు, అఖండ దీపోత్సవం ఏర్పాట్లు**





**శ్రీ సత్యసాయి / కనగానపల్లి, జూలై 18,(రిపబ్లిక్ న్యూస్):** శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం కోనాపురం గ్రామ సమీపంలోని వారాదయ్య కొండపై వెలసిన శ్రీశ్రీశ్రీ వారాదయ్య స్వామివారి (ఆంజనేయస్వామి) ఆలయంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి మహోత్సవాలను ఈ నెల 25, 26 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు శ్రీ వారాదయ్య స్వామి డెవలప్‌మెంట్ సొసైటీ, ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. స్వామివారి కృపను పొందేందుకు రెండు రోజుల పాటు నిర్వహించే విశేష పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భగవదనుగ్రహం పొందాలని వారు కోరారు.

**పంచామృతాభిషేకంతో తొలి పూజలు ప్రారంభం**



మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు పంచామృతాభిషేకంతో తొలి పూజలు ప్రారంభం కానున్నాయి. అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 7 గంటల నుంచి అఖండ దీపోత్సవం (మేలు దీపం) భక్తుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో వెలిగించనున్నారు. రాత్రి 8 గంటల నుంచి హనుమంతుని మహిమను కీర్తించే భజనలు, కీర్తనలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

**భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి**

ఈ నెల 26న (ఆదివారం)మలి పూజలు నిర్వహించి శ్రీ ఆంజనేయస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయనున్నారు. మహోత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపింది. గర్భగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించుకోవాలనుకునే భక్తులు ఆలయ పూజారి చింతకుంట సుదర్శన్‌ను సంప్రదించాలని సూచించారు. రెండు రోజులపాటు జరిగే ఈ ఆధ్యాత్మిక మహోత్సవాలకు సమీప ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారని ఆలయ కమిటీ తెలిపింది.

# పరిశ్రమల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం

**పరిశ్రమల సమస్యలు పరిష్కరిస్తాం -కొలుములపల్లిలో నట్లు - బోల్టులు, హెర్బల్ ఉత్పత్తుల పరిశ్రమల తనిఖీ**

**బేతంచర్ల మండలంలోని పరిశ్రమలను సందర్శించి ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శనివారం బేతంచర్ల మండలంలోని కొలుములపల్లి గ్రామంలో ఉన్న పలు పరిశ్రమలను కలెక్టర్ సందర్శించి, అక్కడి ఉత్పత్తి విధానాలను పరిశీలించారు. ముందుగా ప్రెసీఫాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను సందర్శించి.. అక్కడ నట్లు, బోల్టుల తయారీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ముడి పదార్థాల వినియోగం, యంత్రాల పనితీరు, నాణ్యత ప్రమాణాలు, ఉత్పత్తి సామర్థ్యం వంటి అంశాలపై పరిశ్రమ యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. తయారీ విధానాన్ని ఆసక్తిగా పరిశీలిస్తూ, ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు సేకరించారు. అనంతరం హేమా హెర్బల్ ప్రొడక్ట్స్ పరిశ్రమను కలెక్టర్ సందర్శించారు. కలబంద (అలోవెరా) ముక్కలను ఉపయోగించి షాంపూలు, సబ్బులు తదితర హెర్బల్ ఉత్పత్తులు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ముడి పదార్థాల సేకరణ నుంచి తుది ఉత్పత్తి తయారీ వరకు అనుసరిస్తున్న ప్రక్రియ, నాణ్యత నియంత్రణ, ప్యాకేజింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై యాజమాన్యంతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల యాజమాన్యంతో కలెక్టర్ ముఖాముఖిగా సమావేశమై, వారి సమస్యలు, అవసరాలు, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. పరిశ్రమల నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో పరిశ్రమలు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌లో మంచి గుర్తింపు పొందాలని పరిశ్రమల యాజమాన్యానికి సూచించారు. డోన్ ఆర్డీఓ నరసింహులు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్, బేతంచర్ల తహసీల్దార్ నాగమణి, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు కలెక్టర్ వెంట వున్నారు.



# ఈగల్ ప్రోగ్రాం పై గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం.






**రైల్వే కోడూరు జూలై 18 రిపబ్లిక్ న్యూస్.**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పోలీసు శాఖ ద్వారా ప్రవేశపెట్టిన ఈగల్ ప్రోగ్రాం గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తుంది, ఈగల్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అసాంఘిక కార్యకలాపాలపై గ్రామాలలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి తద్వారా ప్రజలకు అసాంఘిక కార్యక కార్యక్రమాల గురించి చైతన్యపరిచి వారిలో అవగాహన కలిగేలా చేయడమని ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ అన్నారు, ఓబులవారిపల్లి మండలం మంగంపేట గ్రామంలో శనివారం ఈగల్ ప్రోగ్రాం పై పల్లెబాట రచ్చబండ కార్యక్రమాన్ని ఈగల్ ఐజి ఆర్కే రవి కృష్ణ ఐపీఎస్, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది,

గ్రామాలలో ముత్తు పదార్థాలు గంజాయి, కోడిపందాలు, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు లోను కాకుండా గ్రామాలలో యువతను చైతన్య పరచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన ప్రోత్సహించిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని అందరూ దృష్టిలో పెట్టుకుని సన్మార్గంలో పయనించాలని ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్టు తెలిసిన వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని ఆయన తెలియజేశారు మంగంపేట గ్రామంలోని యువత చేత అసాంఘిక కార్యక్రమాలు చెడు వ్యసనాలు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు లోను కాకుండా అలాంటి సంఘటనలు చూసిన వెంటనే ప్రభుత్వానికి తెలియజేస్తామని ఆ గ్రామ ప్రజలు పోలీసుల ఎదుట ప్రమాణం చేశారు, ఈ కార్యక్రమంలో ఈగల్ సీఐ ప్రసాద్ ఓబులవారిపల్లి పోలీస్ సిబ్బంది మంగంపేట గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:2023/87888
ఆదివారం19 జులై 2026

# గ్రేడ్-2 మున్సిపాలిటీగా పెనుకొండ

### బాధిత కుటుంబాలకు చెక్కుల పంపిణీ -బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ






**శ్రీ సత్యసాయి / పెనుకొండ, జూలై 18,(రిపబ్లిక్ న్యూస్):** పెనుకొండ నగర పంచాయతీ గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడం స్థానిక అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితమ్మ అన్నారు. ఈ సందర్భంగా పెనుకొండ మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ గ్రేడ్-2 మున్సిపాలిటీ హోదాతో ప్రజలకు మరింత మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుద్ధ్యం, తాగునీరు, ఇతర పౌర సేవలను మరింత బలోపేతం చేసే చర్యలు చేపడతామని తెలిపారు.అనంతరం నగర పంచాయతీలో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన కార్మికులు ఓబులేష్, రాము, నరసింహులు, ముత్యాలప్ప కుటుంబ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయ చెక్కులను మంత్రి సవితమ్మ పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.సహాయ చెక్కులు అందుకున్న కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, మంత్రి సవితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పల్లె పరామర్శ



**శ్రీ సత్యసాయి / పుట్టపర్తి, జూలై 18,(రిపబ్లిక్ న్యూస్):** రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందిన కుటుంబాన్ని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి శనివారం పరామర్శించారు. పుట్టపర్తి ప్రశాంతిగ్రామ్‌కు చెందిన నరేంద్రబాబు, ఓం లత దంపతులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ ఘటనపై సమాచారం అందుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బాధితుల నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నరేంద్రబాబు, ఓం లతల మృతి అత్యంత విషాదకరమని పేర్కొంటూ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ ఘటనతో కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆయన, తన వంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాల కేసులో ప్రధాన నిర్వాహకురాలు పూల లక్ష్మి అరెస్ట్

### ముజఫర్‌నగర్ దాడుల కేసులో కీలక పురోగతి వాట్సాప్ చాటింగ్‌లపై కూడా పోలీసుల దర్యాప్తు



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 18)** కర్నూలు నగరంలోని ముజఫర్‌నగర్ ప్రాంతంలో ఇటీవల వెలుగుచూసిన అసాంఘిక కార్యకలాపాల కేసులో ప్రధాన నిర్వాహకురాలిగా గుర్తించిన పూల లక్ష్మిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత వారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు సహా మొత్తం ఆరుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.పోలీసుల దర్యాప్తులో పూల లక్ష్మి అద్దెకు తీసుకున్న ఇంటి నుంచి అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో ఆమెను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం ఆమెకు రిమాండ్ విధించింది.ఈ కేసు విచారణలో భాగంగా పూల లక్ష్మితో వాట్సాప్ ద్వారా సంప్రదింపులు జరిపిన వ్యక్తుల వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. వారి పాత్ర, ప్రమేయంపై విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### దేవనకొండ మండల పాఠశాలల్లో ఎంఈవో ఉస్మాన్ భాషా ఆకస్మిక తనిఖీలు



**దేవనకొండ, జూలై 18 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను విస్మరించినా, నిబంధనలను ఉల్లంఘించినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని దేవనకొండ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) ఎం. ఉస్మాన్ భాషా హెచ్చరించారు.శనివారం మండలంలోని పి.కోటకొండ, దిప్పనగుర్తి, ఐరన్ బండ, బి సెంటర్, పాలకుర్తి, తెర్నేకల్, దేవనకొండ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, మెనూ అమలు, హాజరు రికార్డులు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులకు అందించే భోజనం పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులను మాత్రమే నియమించాలని, విద్యా ప్రమాణాల విషయంలో రాజీ పడవద్దని సూచించారు. అలాగే విద్య హక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం 25 శాతం ఉచిత ప్రవేశాలను అర్హులైన విద్యార్థులకు కల్పించడం ప్రతి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం బాధ్యత అని గుర్తు చేశారు.ప్రభుత్వ విద్యా శాఖ నిబంధనలను అన్ని విద్యాసంస్థలు కచ్చితంగా అమలు చేయాలని, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, పోషకాహార భోజనం అందించడంలో ఎలాంటి లోపాలు కనిపించినా చర్యలు తప్పవని ఎంఈవో ఉస్మాన్ భాషా హెచ్చరించారు.

# ప్రాణాపాయంలో మూడు నెలల చిన్నారి

### రూ.17 కోట్ల వైద్యం కోసం

### చేయూత కోరిన మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బల్లా పల్లవి



**అనంతపురం ప్రతినిధి, జూలై 18, (రిపబ్లిక్ న్యూస్):** అరుదైన ఎస్ఎంఏ టైప్-1 వ్యాధితో బాధపడుతున్న మూడు నెలల చిన్నారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ బల్లా పల్లవి పిలుపునిచ్చారు. లోకం కూడా సరిగా తెలియని పసికందు ప్రాణాల కోసం పోరాడుతుండటం ఎంతో బాధాకరమని ఆమె పేర్కొన్నారు.

చిన్నారికి అత్యవసరంగా అందించాల్సిన ప్రత్యేక చికిత్స కోసం సుమారు రూ.17 కోట్ల వరకు వ్యయం అవసరమవుతోందని తెలిపారు.

**ప్రతి విరాళం చిన్నారి జీవితానికి ఆశాకిరణంగా మారుతుంది**

సాధారణ కుటుంబానికి అంత పెద్ద మొత్తాన్ని సమకూర్చడం అసాధ్యమని, దాతలు, సేవా సంస్థలు, ప్రజలు తమ వంతు సహకారం అందించి చిన్నారి ప్రాణాలను కాపాడాలని కోరారు.ఒక్క రూపాయి నుంచి ఎవరి శక్తి మేరకు వారు అందించే ప్రతి విరాళం చిన్నారి జీవితానికి ఆశాకిరణంగా మారుతుందని బల్లా పల్లవి పేర్కొన్నారు. సమాజంలోని దాతృత్వం కలిగిన ప్రతి ఒక్కరూ స్పందించి చిన్నారికి జీవించే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**విరాళాల కోసం బ్యాంకు వివరాలు:**
**ఖాతాదారు:** రాచమల్ల నవీన్ కుమార్ రెడ్డి
**ఖాతా సంఖ్య:** 30830783425
**బ్యాంకు:** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)
**ఐఎఫ్ఎస్‌సీ:** SBIN0011125
**శాఖ:** రాయలచెరువు

# అధికారులుసమగ్ర సమాచారంతో సమావేశమునకు హాజరు కావాలి.

### ఎంపీడీవో ఎం వి ఎన్ రాజేంద్ర.



**రైల్వే కోడూరు జూలై 18 రిపబ్లిక్ న్యూస్.** మండల సర్వసభ్య సమావేశమునకు మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ పూర్తి సమగ్ర సమాచారంతో హాజరుకావాలని మండల అభివృద్ధి అధికారి ఎం.వి.ఎన్ రాజేందర్ తెలియజేశారు, మండల కేంద్రం ఓబులవారిపల్లి మండల అభివృద్ధి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఎంపీడీవో అన్నారు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అధ్యక్షురాలు ఆధ్వర్యంలో జరగబోయే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు ఆయా శాఖల సమాచారంతో పాల్గొనాలని అన్నారు మండలంలోని జడ్పిటిసి లు ఎంపీటీసీలు సర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొని తమ తమ ప్రాంత సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని తద్వారా అభివృద్ధి పదంలో గ్రామాలను నడిపేందుకు తగు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు, ప్రజాప్రతినిధులు ఆయా పంచాయతీల్లో ప్రజా సమస్యలు ఏమైనా ఉంటే సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలను చూడాలన్నారు ఈ సమావేశంలో ఈవో పీ ఆర్ డి రామ్మోహన్ రెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనం పరిశుభ్రతకు పెద్దపీట

### కుంటిమద్ది పాఠశాల వంటశాలకు రూ.3 లక్షలు -పాపిరెడ్డిపల్లిలో రూ.80 లక్షల సీసీ రోడ్ల ప్రారంభం





**అనంతపురం/రాప్తాడు, జూలై 18,(రిపబ్లిక్ న్యూస్):** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు పచ్చదనం, పరిశుభ్రతకు కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రామగిరి మండలం కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె పాల్గొన్నారు.పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించిన ఎమ్మెల్యే, ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలను పరిశీలించిన ఆమెకు వంటశాల లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రధానోపాధ్యాయులు వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మండల పరిషత్ నిధులతో రూ.3 లక్షలు కేటాయించి వంటశాల నిర్మించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

**మొక్కను సంరక్షించే బాధ్యతలను విద్యార్థులకు అప్పగించాలి**

పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పచ్చదనం, పరిశుభ్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంచితే ఆ అలవాట్లు కుటుంబాలకు కూడా విస్తరిస్తాయని చెప్పారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతలను విద్యార్థులకు అప్పగించాలని సూచించారు.అనంతరం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఉపాధి హామీ పథకం నిధులతో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన రహదారిని ప్రారంభించగా, గ్రామస్తులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె భజన కార్యక్రమంలో పాల్గొని అన్నదానంలో భక్తులతో కలిసి భోజనం చేశారు.

**ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారి సమస్య పరిష్కారం**

తర్వాత గ్రామంలో ఉపాధి హామీ, డీఎంఎఫ్ నిధులతో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించిన మరో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారి సమస్య పరిష్కారమైందని గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు ఆలయాలకు వెళ్లే మార్గాలను కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గతంతో పోలిస్తే ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలే గమనిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

# పవన్ ఆరోగ్యం కోసం మృత్యుంజయ హోమం

### స్కంద పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు -జనసేన నాయకుడు తేజ రాయల్ నిర్వహణ





**అనంతపురం/ పంపనూరు, జూలై 18,(రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ త్వరగా పూర్తిగా కోలుకుని ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆత్మకూరు మండలం పంపనూరులోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ శుద్ధ పంచమి (స్కంద పంచమి) సందర్భంగా జనసేన నాయకుడు, నగర కార్పొరేషన్ 15వ డివిజన్ ఇన్‌చార్జి తేజ రాయల్ ఆధ్వర్యంలో మృత్యుంజయ హోమం, ఆయుష్య హోమం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హోమం, శత్రు నివారణార్థం వారాహి హోమం నిర్వహించారు.

తేజ రాయల్ ఆలయానికి చేరుకోగా అర్చకులు పూర్ణకుంభంతో, మేళతాళాల మధ్య స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో నిండు నూరేళ్లు జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రోగ, రుణ, శత్రు నివారణకు ప్రసిద్ధి చెందిన పంపనూరు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో ఈ పూజలు నిర్వహించడం విశేషమని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి తేజ రాయల్, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రచార కార్యదర్శి అంగడి వెంకటాచలపతి, కాయగూర లక్ష్మీప్రసాద్, చిరంజీవి సేన జిల్లా అధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, రామ్ చరణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, వీర మహిళలు శరణ్య, మంజుల, శైలజతో పాటు జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతో ఆలయ రహదారి శుభ్రపరిచిన యువ నాయకుడు ఎర్రగోటి అంజి

### సేవాభావానికి స్థానికుల ప్రశంసలు




**దేవనకొండ, జూలై 18( ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** దేవనకొండ మండల కేంద్రంలోని కొండగేరిలో వెలసిన శ్రీ శంకర్ స్వామి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిని స్థానిక యువకులు సొంత ఖర్చులతో జేసీబీ సహాయంతో శుభ్రం చేయించి ఆదర్శంగా నిలిచారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా, రహదారిపై పెరిగిన ముళ్లపొదలు, మట్టి, చెత్తను తొలగించి మార్గాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.ఎలాంటి ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూడకుండా, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవా కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల గ్రామస్థులు యువతను అభినందించారు.ప్రతి రోజు ఆలయానికి వచ్చే భక్తులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుండగా, ఇటీవల రహదారి అధ్వాన్నంగా మారడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిని గుర్తించిన యువత వెంటనే స్పందించి శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టింది.ఈ కార్యక్రమంలో ఎర్రగోటి అంజి కీలక పాత్ర పోషించారు. ఆయన ఆధ్వర్యంలో ఎర్రగోటి నల్లన్న, ఎర్రగోటి నరసయ్య, బొజ్జె మల్లికార్జునతో పాటు పలువురు యువకులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.రహదారి పూర్తిగా పరిశుభ్రంగా మారడంతో ఆలయానికి వచ్చే భక్తులు సులభంగా రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడింది.యువత చేసిన ఈ సేవా కార్యక్రమం గ్రామంలో సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచిందని స్థానికులు కొనియాడారు.ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినివ్వాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు.“సమాజ సేవే నిజమైన సేవ“ అనే భావనతో యువత ముందుకు రావడంఅభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.

# ల్యాండ్ సీలింగ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్

## వేడుకున్న పట్టించుకోని అధికారులు -దిక్కున్న చోట చెప్పుకోమన్న అక్రమ భూస్వామి.

**రైల్వే కోడూరు జూలై 18 రిపబ్లిక్ న్యూస్.**

పేదరిక నిర్మూల నలో భాగంగా మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ హయాంలో 1972 సంవత్సరంలో దేశంలో భూమిలేని నిరుపేదలకు వ్యవసాయ భూ పంపిణీ చేసి తద్వారా పేదలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఆమె తీసుకున్న నిర్ణయములో భాగంగా రాజంపేట నియోజకవర్గం పోలి సీతారాంపురం పంచాయతీ లోని భూదాత ఎలక చర్ల నర్సారెడ్డి ఆయనకున్న భూముల్లో అధిక మొత్తంలో సుమారు 300 ఎకరముల భూమిని ల్యాండ్ సీలింగ్ లో భాగంగా పోలి సీతారాంపురం పంచాయతీ పరిధి లోని కిచమాంపురం, పోలి, సీతారాంపురం గ్రామాలలోని పలువురు ఎస్సీ ఎస్టీ బీసీ పేదలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయన సొంత భూములను పేదలకు పంపిణీ చేయడం జరిగినది . ఈ నేపథ్యంలో పేదలకు కేటాయించిన భూములు ప్రభుత్వము అభివృద్ధి చేసుకునేందుకు సహాయ సహకారాలు అందకపోవడంతో ఆ భూములను వారు అభివృద్ధి చేసుకోలేక అలా ఉండి పోవడం జరిగినది కొందరు పేదలు కుటుంబ పోషణకు ఆ భూములను అమ్ముకోగా మరి కొందరు ఎప్పటికైనా దుక్కి దున్ని వ్యవసాయం చేసుకోవాలన్న లక్ష్యంతోవృధాగా వదిలేశారు, ఎలక చర్ల నర్సారెడ్డి



సీతారాంపురం గ్రామప్రాంత దళితులకు సర్వేనెంబర్ 142లో సుమారు 42 ఎకరాల 67 సెంట్లు ఆ ప్రాంత పేదలకు పంపిణీ చేయగా ఈ ప్రాంత సర్వేనెంబర్ 142 లోని 42 ఎకరాల 67 సెంట్లు భూమి డీకే టి, ప్రభుత్వము ల్యాండ్ సీలింగ్ భూమిగా గుర్తించింది అలాంటి డీకేటీ పొలాన్ని సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రలోభాలకు లోనై ల్యాండ్ సీలింగ్ డీకేటి భూమిని మందరం కొత్తపల్లి గ్రామం అగ్రకులానికి చెందిన తంబళ్ల వేణుగోపాల రెడ్డి ఆ భూములను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధముగా అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని తిరిగి ఆ



భూములను ఇతరులకు అమ్మినట్లు ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తూ ఆవేదన చెందుతున్నారు పలుమార్లు రాజంపేట తాసిల్దార్ కి సబ్ కలెక్టర్ కి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం శూన్యం, అన్నమయ్య జిల్లా ఉన్న సమయంలో ఆ జిల్లా కలెక్టర్ కి విన్నవించుకున్నప్పటికీ ఫలితం శూన్యం గత ఐదు నెలల క్రితం రాజంపేట సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేయడంతో ఆమె ఫిర్యాదు కాపీని పరిశీలించి పోలీసులకు కంప్లైంట్ చేయమని సలహా ఇవ్వడముతో రాజంపేట ఏ ఎస్పి కి ఫిర్యాదు చేయడం జరిగినది ఆయన సీఐ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు ఇవ్వండి అని సలహా ఇవ్వడంతో రాజంపేట మన్నూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగినది అనంతరం సీఐ సదరు వేణుగోపాల్ రెడ్డి ని పిలిపించి విచారించగా మీ దగ్గర ఉన్న ఆధారాలు తీసుకురండి అని చెప్పడం జరిగినది, తర్వాత వేణుగోపాల్ రెడ్డి ఆయనకు ఆధారాలు ఇవ్వడం గానీ రావడం గానీ జరగలేదని సిఐ అన్నారు సర్వే నెంబరు 142 లో మా తండ్రి ఆవుల పెంచలేయ్యకు 3.47సెంట్లు భూమిని ప్రభుత్వం మంజూరు చేసినది మావద్ద ఆనాటి ప్రభుత్వం ఇచ్చిన డి ఫారం, పాస్బుక్, ఎంజాయ్ మెంట్ సర్టిఫికెట్ మా వద్ద ఉన్నాయి, మా తండ్రికి ఇద్దరు కుమారులంనేను ఆవుల హరినాథ్ నా అనుమతి లేకుండా మా అన్న అమ్మినట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు ఆ రిజిస్ట్రేషన్ నేను పరిశీలించగా మా తండ్రి పెంచలయ్య,కానీ ఆ రిజిస్ట్రేషన్ లో మా తండ్రి సుబ్బరాయుడు అని ఉంది అందులో ఉన్న సిగ్నేచర్ మా అన్నది కాదు మా పాస్ బుక్ నెంబర్ 155 130, కానీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లో పాస్ బుక్ నెంబర్ 155 144 గా ఉంది ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యానికి ఇది పరాకాష్ట జిల్లా కలెక్టర్ మా వినతిని పరిగణలోకి తీసుకొని మా సమస్యను పరిష్కరించి మా భూమిని మాకు సొంతం చేసి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు

# రీజినల్ కంటి ఆస్పత్రిలో తొలి అధునాతన 'గ్యాట్' శస్త్రచికిత్స విజయవంతం

### గ్లాకోమా బాధిత మహిళకు ఉచితంగా చికిత్స

### -రాష్ట్ర ప్రభుత్వ ఆసుపత్రుల్లో తొలిసారిగా కర్నూలులోనే నిర్వహణ





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 18)**

కర్నూల్ రీజినల్ ఐ హాస్పిటల్లో అత్యాధునిక కంటి శస్త్రచికిత్స అయిన గోనియోస్కోపిక్ అసిస్టెడ్ ట్రాన్స్లూమినల్ ట్రబెక్యులోటమీ (జిఏటిటి) ను విజయవంతంగా నిర్వహించారు. కర్నూలుకు చెందిన 61 ఏళ్ల మహిళకు గ్లాకోమా కారణంగా కంటిలో ఒత్తిడి పెరిగి, కంటి నరం దెబ్బతిని చూపు కోల్పోయే ప్రమాదం ఏర్పడడంతో ఈ శస్త్రచికిత్స చేపట్టారు. శస్త్రచికిత్స అనంతరం వారం రోజుల తర్వాత నిర్వహించిన పరీక్షల్లో రోగి ఆరోగ్య పరిస్థితి సంతృప్తికరంగా ఉందని, చికిత్స పూర్తిగా



విజయవంతమైందని వైద్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, విభాగాధిపతి డాక్టర్ యుగంధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో శస్త్రచికిత్స నిర్వహించిన డాక్టర్ మణికంఠను అభినందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, ఈ అధునాతన గ్లాకోమా చికిత్స ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కడా అందుబాటులో లేదని, తొలిసారిగా కర్నూల్ రీజినల్ ఐ హాస్పిటల్లో విజయవంతంగా నిర్వహించడం విశేషమని తెలిపారు. గతంలో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో సేవలందించిన డాక్టర్ మణికంఠ తన అనుభవంతో ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు. రోగి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, సాధారణంగా హైదరాబాద్ వంటి నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే ఈ అత్యాధునిక చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# బల్క్ వేస్ట్ జనరేటర్లకు తప్పనిసరి నమోదు

### స్వీయ వ్యర్థాల నిర్వహణకు కలెక్టర్ పిలుపు - నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు

### రోజుకు 100 కిలోలకుపైగా వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు సొంత ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 18)**

నగరంలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలు తమ వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు సొంత వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి సూచించారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జ్యోతి డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు2026పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, 'బల్క్ వేస్ట్ జనరేటర్' నమోదు ప్రక్రియను నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోజుకు 100 కిలోలకుపైగా ఘన వ్యర్థాలను ఉత్పత్తి చేసే వ్యాపార, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థలు తదితర సంస్థలు బల్క్ వేస్ట్ జనరేటర్లుగా నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు2026 ప్రకారం తడి వ్యర్థాలను కంపోస్టింగ్, బయోమీథనేషన్ లేదా ఇతర ఆమోదిత సాంకేతికతల ద్వారా ప్రాంగణంలోనే శాస్త్రీయంగా ప్రాసెస్ చేయాలని సూచించారు.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న తర్వాత నగరపాలక సంస్థ సంబంధిత వివరాలను పరిశీలించి, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం జిల్లా పరిపాలన, నగరపాలక సంస్థకు ఉందని హెచ్చరించారు.

నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, వ్యర్థాలను మూలంలోనే శాస్త్రీయంగా నిర్వహించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు నగర పరిశుభ్రతను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. పెద్ద వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు, విద్యాసంస్థలు నిబంధనలకు అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి వ్యర్థాల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# పేద ప్రజలకు ఆసరా సిఎం సహాయనిధి

### :- ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి



**బండి ఆత్మకూరు, జూలై 18, (రిపబ్లిక్ న్యూస్):–** పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం అని శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. శనివారం వేల్పనూరులో నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 36 లక్షల విలువగల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందిస్తు ఆసరాగా నిలుస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఒక వైపు ప్రజా సంక్షేమం, మరో వైపు రాష్ట్రభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలోశ్రీశైలం నియోజక వర్గ తెలుగు యువత అధ్యక్షులు బొల్లవరం మల్లేశ్వర రెడ్డి, టిడిపి బండి ఆత్మకూరు మండల అధ్యక్షులు ముమ్మడి నాగ కృష్ణరెడ్డి,వెంకటాపురం శ్రీనివాసులు, ఓంకారం దేవస్థానం చైర్మన్ అల్లే చెన్నారెడ్డి,ఒడ్డు మధుసూదన్ రెడ్డి, జాకీర్ ఖాన్, కొరకంచి శంకర్ ,ఆయా గ్రామాల టిడిపి నాయకులు బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రయోజనకరంగా ఫసల్ బీమా పథకం -ఏఓ పవన్ కుమార్



సోయాబీన్ పైరు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి పవన్ కుమార్

**బండి ఆత్మకూరు, జూలై 20,( రిపబ్లిక్ న్యూస్):-** ఫసల్ బీమా యోజన పథకమును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రం బండి ఆత్మకూరు పరిధిలోని పంట పొలాలు క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. సాగుచేసిన సోయా చిక్కుడు పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్ సీజన్లో రాబోతున్న ప్రకృతి విపత్తు ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు వలన మొక్క వడిలిపోయినట్టు ఉన్నపుడు మల్టీకె, కానీ నానో యూరియా కానీ స్ప్రే చేసుకోవడం వలన పంట బెట్టను తట్టుకొని ఉంటుందని తెలిపారు. వేడి వాతావరణం ఉన్నపుడు రసం పీల్చే పురుగులు వలన నష్టం వస్తుందని చెప్పారు. వీటి నివారణ కోసం అసెఫేట్ 3 జిను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఖరీఫ్లో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫసల బీమా ప్రీమియం చెల్లించి పంటలకు బీమా చేసుకోవాలని రైతులను కోరారు. పంట రుణాలు పొందిన రైతులు నేరుగా బ్యాంక్ సంప్రదించి పంట బీమా ప్రీమియం చెల్లించాలని, ఇతరులు మీసేవ వద్ద ప్రీమియం చెల్లించి పంట బీమా చేసుకోవాలని తెలిపారు. రైతులు మరింత సమాచారం కొరకు స్థానిక రైతు సేవ కేంద్రా సిబ్బందిని లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని తెలిపారు.

# మహానందీశ్వరుడి హుండీ ఆదాయం రూ.52.50 లక్షలు






**మహానంది , జూలై 18, (రిపబ్లిక్ న్యూస్)** శ్రీ మహానందీశ్వర స్వామివారి దేవస్థానంలో 50 రోజుల హుండీ కానుకల లెక్కింపును శనివారం కార్యనిర్వాహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు సమర్పించిన మొత్తం కానుకలు రూ.52,50,131గా నమోదయ్యాయి. ఇందులో .51,70,417, అన్నప్రసాదానికి రూ.55,670, గోసంరక్షణకు రూ.24,044 లభించాయి. అలాగే మలేసియా కరెన్సీ 1 రింగిట్కు చెందిన మూడు నోట్లు కూడా హుండీలో లభించాయి. హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థాన సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటి పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపించాలి




**బండి ఆత్మకూరు ,జూలై 20,( రిపబ్లిక్ న్యూస్):-** మండల పరిధిలోని సోమరాజుల పల్లె గ్రామంలో ప్రజా సంఘాల నాయకులు సామాజిక శంఖారావం నిర్వహించారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్, మండల నాయకులు కుళాయి స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు రామచంద్రుడు, సుబ్బారాయుడులు గ్రామంలోనీ దళిత కాలనీలో పర్యటించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని నిరుపేదలకు ఇంటి పట్టాలు మాత్రమే ఇచ్చారని.. స్థలాలు ఇంకా చూపించలేదని వారికి వెంటనే ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్మశాన వాటిక కోసం స్థలం కేటాయించాలన్నారు. డప్పు కళాకారులకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం వారి జీవనాధారం కోసం ఒక ఎకరం భూమి పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో వెంకట లక్ష్మమ్మ, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులచే 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' శ్రమదానం



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 18 రిపబ్లిక్ న్యూస్**

అన్నమయ్య జిల్లా పోలీసు శాఖ ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు శనివారం చౌడేపల్లి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యంతో పోలీస్ స్టేషన్ కార్యాలయ ఆవరణం పరిసరాలను అధికారులు, సిబ్బంది శ్రమదానంతో శుభ్రం చేశారు. గడ్డపారలు, గుణపాలతో చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి, చిన్న గుంతలను పూడ్చివేసి పరిసరాలను పరిశుభ్రంగా మార్చుకున్నారు. పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యాలయ పరిసరాలను శుభ్రం చేసుకున్నారు. పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్, ఎస్సై చిన్నరెడ్డప్ప సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల నుంచే గొప్ప విజయాలు సాధ్యం

**సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**చేగుంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తా**

**మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి**








**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 18( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడితే దేశంలోనే అత్యున్నత స్థానాలను చేరుకోవచ్చని శక్తి ( కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీలు) మరియు గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు.

మెదక్ జిల్లా చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో శనివారం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పుడు బ్లాక్‌బోర్డు మాత్రమే కాదు, ప్రపంచాన్ని చూసే అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివి ఐఐటీలు, మెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధిస్తున్నారని చెప్పారు. చేగుంట పాఠశాల నుంచే ఇద్దరు విద్యార్థులు ఐఐటీలో ప్రవేశం పొందడం ఉపాధ్యాయుల నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉండాలని, డాక్టర్, ఐఏఎస్, ఇంజనీర్ లేదా ఇతర ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం కృషి చేయాలని సూచించారు. విజయవంతమైన వ్యక్తుల్లో కనిపించే ప్రధాన లక్షణం క్రమశిక్షణేనని, చదువుతో పాటు కష్టపడి పనిచేసే అలవాటు పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం, కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం అభినందనీయమన్నారు. విద్యాభివృద్ధికి సేవలందిస్తున్న సంకల్ప్ సంస్థను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటివరకు వేలాది మంది విద్యార్థులకు చదువుకునేందుకు సహాయం అందించడంతో పాటు, ఉన్నత విద్య కొనసాగించాలనుకునే విద్యార్థులకు అండగా నిలుస్తామని ప్రకటించడం గొప్ప సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. తన తండ్రి వెంకటస్వామి స్ఫూర్తితోనే సమాజానికి తిరిగి ఇవ్వాలనే భావన అలవడిందని మంత్రి తెలిపారు. వ్యాపారంలో విజయం సాధించిన తర్వాత పెద్దపల్లి పార్లమెంట్ నియోజకర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నిచర్, ఇతర మౌలిక వసతులు కల్పించడం ప్రారంభించానని చెప్పారు. సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించడం దాతృత్వం కాదని, అది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా నేటి కాలంలో అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. కృత్రిమ మేధ విస్తరిస్తున్న నేపథ్యంలో సంప్రదాయ ఉద్యోగాల్లో మార్పులు వస్తున్నాయని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందిస్తోందన్నారు. ద్వారా విదేశీ భాషా శిక్షణతో పాటు దేశీయ, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు చదువులో రాణించడమే కాకుండా తల్లిదండ్రులను గౌరవిస్తూ మంచి విలువలతో ఎదగాలని సూచించారు. చేగుంట ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్, మేనేజింగ్ డైరెక్టర్, సంకల్ప్ సంస్థ ప్రతినిధులు, దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, చేగుంట సర్పంచ్, ఉపసర్పంచ్, మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సినీ నటుడు మంచు విష్ణుకు ఘన స్వాగతం







**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 18 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
మెదక్ జిల్లా లో టూరిజం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంచు విష్ణు ఏడుపాయలకు చేరుకోగానే అదనపు కలెక్టర్ నగేష్ మొక్క ను అందించి స్వాగతం పలికారు. ఏడుపాయల ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో వన దుర్గ భవాని మాత గుడిలోకి తీసుకువెళ్లారుసినీ నటుడు మంచు విష్ణు ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన, అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర , ప్రాముఖ్యాన్ని అదనపు కలెక్టర్ నగేష్ మంచు విష్ణు కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేరడిగుంట & మక్తాగూడెం గ్రామ పంచాయతీలో విద్యార్థుల త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కార ఏర్పాట్లకు చర్యలు

**నేరేడు గుంట సర్పంచ్ వొగ్గు సాయికిరణ్**

**విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా పనులు ప్రారంభం**





**అందోల్ ప్రతినిధి జులై 18 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**నేరడిగుంట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు చాలాకాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో నేడు పైప్‌లైన్ మరమ్మతు మరియు తాగునీటి సౌకర్యాల అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగింది.

“నా చిన్నారి చెల్లెళ్లు, తమ్ముళ్లు పాఠశాలలో ఒక్క చుక్క నీటి కోసం కూడా ఇబ్బంది పడకూడదు“ అనే సంకల్పంతో, నా సర్పంచ్ పదవీకాలంలోనే ఈ సమస్యకు శాశ్వత ముగింపు పలకాలని నిర్ణయించి పనులు ప్రారంభించాం. ఈ పనులు త్వరలో పూర్తికానుండగా, ఇకపై విద్యార్థులు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా చదువుపై పూర్తి దృష్టి పెట్టే అవకాశం కలుగుతుంది. గ్రామ అభివృద్ధితో పాటు, విద్యార్థుల సంక్షేమమే మా గ్రామ పంచాయతీ ప్రధాన బాధ్యత. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలకు అవసరమైన ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరిస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ తెలిపారు.

# పురాతన ,వారసత్వ సంపదకు నిలయం మెదక్ జిల్లా

**మా అధ్యక్షుడు ,విలక్షణ హాలీవుడ్ నటుడు, సినీ నిర్మాత మంచు విష్ణు**









**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 18( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
శనివారం ,మెదక్ జిల్లా లో టూరిజం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మంచు విష్ణు ఏడుపాయలకు చేరుకోగానే అదనపు కలెక్టర్ నగేష్ మొక్క ను అందించి స్వాగతం పలికారు. ఏడుపాయల ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మత గుడిలోకి తీసుకెళ్లరూ.

సినీ నటుడు మంచు విష్ణు ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన, అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర , ప్రాముఖ్యాన్ని అదనపు కలెక్టర్ నగేష్ మంచు విష్ణు కు వివరించారు. అనంతరం చారిత్రక నేపథ్యం కలిగిన మెదక్ ఖిల్లాను సందర్శించి దాని చరిత్రను జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడినుండి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మెదక్ సీఎస్ఐ కేథడ్రల్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ...పురాతన ,వారసత్వ సంపదకు నిలయం మెదక్ జిల్లా అన్నారు. మన చరిత్ర గురించి పుస్తకాల్లో చదివాం,ఎన్నో విన్నాం కానీ చూసింది చాలా తక్కువ అని సినీ నటుడు మంచు విష్ణు పేర్కొన్నారు..

మనకున్న చరిత్ర 95% ప్రపంచంలో వేరే దేశాలకు ఎవరికి లేదు అన్నారు..ఆ చరిత్రను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.. ఇక్కడున్న జిల్లా యంత్రాంగం మెదక్ జిల్లాలో ఉన్నటువంటి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ కూడా తయారు చేసినట్టు తెలిపారు. మెదక్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలతో పాటు, చారిత్రిక నేపథ్యం కలిగిన పర్యాటక ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి.. వాటిని కాపాడుకోవాలి.. హైదరాబాద్ నుంచి మెదక్ కు కూతవేటు దూరంలో ఉన్న చారిత్రక పర్యాటక ప్రాంతాన్ని చూడకపోవడం సిగ్గుచేటు అనిపించింది అన్నారు. మన చరిత్రను మనం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది అన్నారు .. భవిష్యత్తులో నేను నటించే సినిమాలో కానీ ప్రొడ్యూస్ చేసే సినిమాలో అయినా మెదక్ నుంచి ఒక సినిమాకు అవకాశం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్,మున్సిపల్ కమిషనర్ నవీన్ ,మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,కౌన్సిలర్లు, డి ఎస్ పి ప్రసన్న కుమార్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు

## కట్కాపూర్ నుండి ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ పడాల పూర్ణిమా తిరుపతి





**రాయికల్ మండలం జులై,18( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కట్కాపూర్ గ్రామంలో ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళే విద్యార్థుల తల్లి తండ్రులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది కట్కాపూర్ గ్రామం నుండి ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా పేరెంట్స్ జాగ్రత్త వహించాల్సిందిగా కోరడం జరిగింది తెలంగాణ చరిత్రలోని ఏ గ్రామంలో రానని గురుకులం సీట్లు మరి కట్కాపూర్ గ్రామంలో రావడం గ్రామానికి ఎంతో గౌరవంగా ఉందని మాట్లాడడం జరిగింది ఇటువంటి గ్రామం నుండి ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపించినట్లయితే ప్రభుత్వం నుండి వచ్చేటువంటి సంక్షేమ పథకాలు రద్దు చేయబడతాయని చెప్పడం జరిగింది అదేవిధంగా పంపియొద్దని పేరెంట్స్ ను కోరడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో కట్కాపూర్ గ్రామ సర్పంచ్ మాజీ ఎంపీపీ పడాల పూర్ణిమ తిరుపతి రాయికల్ మండల విద్యా అధికారి రాఘవులు మరియు ప్రధానోపాధ్యాయులు ప్రతాపరెడ్డి మరియు ఉపాధ్యాయులు పేరెంట్స్ పిల్లలు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## నీట్ -2026 ఫలితాల్లో “462“ మార్కులతో ఎంబీబీఎస్ సీటుతో మెరిసిన చెర్ల కోశీడాపూర్ విద్యార్థి బెల్లాల శ్రవణ్



**రాయికల్ మండలం జులై 18( రిపబ్లిక్ న్యూస్ )**
ప్రభుత్వ గురుకుల పాఠశాల సింగారావుపేట పాఠశాల లో పదవ తరగతి వరకు చదువుకున్న బెల్లాల శ్రవణ్ 462 మార్కులతో నిట్ లో ఎంబిబిఎస్ సిట్ సాధించారు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి విద్యార్థులు కూడా ఎంబిబిఎస్ సాధించడం ఎంతో గర్వకారణం అని ఆ గ్రామస్తులు అంటున్నారు పదవ తరగతి వరకు సింగర్ రావు పేట గురుకులంలో చదివి పై చదువుల కొరకై హైదరాబాద్ ప్రైవేట్ కళాశాలలో విద్య అభ్యసించి సీటు సాధించడం పట్ల ఆ గ్రామ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు ఎంబీబీఎస్సీ సాధించడం మా గ్రామానికి గర్వకారణం అని అలాగే శ్రవణ్ అక్క భూపాల్ పల్లి లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించి ఆమె విద్యను అభ్యసిస్తుంది వారిద్దరూ కొండాపూర్ కు గర్వకారణం అని గ్రామస్తులు అంటున్నారు ఈ గ్రామంలో ఇంతవరకు ఎంబిబిఎస్ సీట్ సాధించినా వారు ఎవరూ లేరని ఇది మొదటిసారి అని గ్రామస్తులు ఆనందోత్సవాల మధ్య శ్రవణ్ కు శృతి కి శుభాకాంక్షలు తెలిపారు

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం

**‘స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర‘ కార్యక్రమంలో :-ఎంపీడీఓ జ్యోతి**

**తెర్నేకల్ జడ్పీహెచ్ఎస్‌లో మొక్కలు నాటి విద్యార్థులకు అవగాహన కల్పించిన:-డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్**



**దేవనకొండ, జూలై 18**
**(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి పాటించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని దేవనకొండ ఎంపీడీఓ జ్యోతి అన్నారు. శనివారం దేవనకొండ మండలంలోని తెర్నేకల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ‘స్వర్ణాంధ్రస్వచ్ఛ ఆంధ్ర‘ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్, పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ) లక్ష్మణ్ పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, చెత్త వర్గీకరణ వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని, మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామాలు, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధుల నివారణతో పాటు ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలే స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ సిబ్బంది, విద్యార్థులు పాల్గొని పరిశుభ్రత, పచ్చదనం పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# చలో సరూర్నగర్ యువ సంగ్రామం సదస్సు





**పటాన్చెరు నియోజకవర్గ ప్రతినిధి జులై 18 ప్రజా రిపబ్లిక్ న్యూస్**
సదస్సులోహైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘యువ సంగ్రామ సదస్సు‘ కార్యక్రమానికి బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు మచ్చేందర్ కృష్ణ యశ్వంత్ సింగ్ సురేష్ రాజేష్ వినోద్ సింగ్ నరేష్ సింగ్ సరూర్‌నగర్‌కు ఫుల్ జోష్ తో బయలుదేరారు.

# రెడ్ క్రాస్ వాలంటీర్లుగా చేరండి..

**యువతకు జిల్లా కలెక్టర్ పిలుపు**

**జిల్లాలో బలమైన రెడ్ క్రాస్ వాలంటీర్ సైన్యం ఏర్పాటు లక్ష్యం**



**నంద్యాల బ్యూరో, జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** సేవా దృక్పథం, మానవతా విలువలు కలిగిన యువత స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ వాలంటీర్లుగా నమోదు చేసుకుని సమాజానికి అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం జిల్లాలో బలమైన "రెడ్ క్రాస్ వాలంటీర్ సైన్యాన్ని" ఏర్పాటు చేయడమే లక్ష్యంగా జిల్లా యువజన సంక్షేమ శాఖ (సెట్కూర్), భారత రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన"రెడ్ క్రాస్ వాలంటీర్‌గా మారండి" పోస్టర్‌ను కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు జి. రాజకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని యువతీ యువకులు, విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు వచ్చి స్వచ్ఛందంగా భారత రెడ్ క్రాస్ సొసైటీ వాలంటీర్లుగా నమోదు చేసుకుని సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు సంభవించిన సమయంలో ప్రజలకు తక్షణ సహాయం అందించగల శిక్షణ పొందిన వాలంటీర్ల బృందం ప్రతి జిల్లాకు అవసరమని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ వాలంటీర్లుగా చేరిన వారికి సీపీఆర్, ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్), విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్మెంట్), ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు, పరిశుభ్రత-పర్యావరణ పరిరక్షణ, రక్తదాన సేవలు తదితర అంశాలపై నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా యువత సేవా కార్యక్రమాల్లో సమర్థవంతంగా పాల్గొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు, విద్యార్థులు పోస్టర్‌లో పొందుపరిచిన క్యూఆర్ కోడ్ ద్వారా లేదా 8985770583, 9347922901 వాట్సాప్ నంబర్లను సంప్రదించడం ద్వారా, అలాగే రెడ్ క్రాస్ ఈ-మెయిల్ ఐడీ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకుని రెడ్ క్రాస్ వాలంటీర్లుగా చేరాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. రాము నాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, సెట్కూర్ సీఈఓ డా. వేణుగోపాల్, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, జిల్లా కార్యదర్శి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాముల భద్రతపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాసపు తనిఖీ

**ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం భద్రతా ఏర్పాట్లు కొనసాగించాలని అధికారులకు ఆదేశం**



**నంద్యాల బ్యూరో, జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెల నిర్వహిస్తున్న తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి శనివారం నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డ్‌లో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) గోదాములను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రతకు సంబంధించిన అన్ని రక్షణ చర్యలు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా అమలవుతున్నాయా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాముల వద్ద అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, డోర్ లాక్ సీళ్ల పరిస్థితి, సీసీటీవీ నిఘా వ్యవస్థ పనితీరు, అగ్నిమాపక పరికరాల అందుబాటు, భద్రతా నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమైన అంశమన్నారు. ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని భద్రతా చర్యలను నిరంతరం అప్రమత్తంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పోలీసు లాగ్‌బుక్‌ను పరిశీలించి విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. భద్రతా వ్యవస్థలో భాగమైన సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అగ్నిమాపక పరికరాలు ఎప్పటికప్పుడు వినియోగానికి సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి డి. రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర సాధనకు అందరూ సహకరించాలి

**కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం -జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**





**నంద్యాల బ్యూరో, జూలై, 18 (రిపబ్లిక్ న్యూస్):**స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం ద్వారా జిల్లాలో పచ్చదనం పెంపొందించేందుకు అందరూ సహకరించాలి జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డిఆర్ఓ, కలెక్టరేట్ ఎఓ సుభాకర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమానికి పెద్ద పీట వేస్తూ ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున, ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మన ప్రధాన కర్తవ్యం అన్నారు. ప్రజలు రోజువారీ దినచర్యలో భాగంగా వారి అవసరాల కోసం ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ప్రత్యామ్నాయ జ్యూట్/కాటన్ బ్యాగులు వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధిక వర్షాల కురిసిన సమయంలో నీటి నిల్వలు ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మలేరియా, డయేరియా ప్రబలకుండా విస్తృత చర్యలు పాటిస్తూ ప్రతి శుక్రవారం రోజున డ్రైడే పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ లో పరిశుభ్రత కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. అదే విధంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు

# బేతంచెర్లలో సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్, డోన్ ఎమ్మెల్యే

**"స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" లక్ష్యాల సాధనలో ఘన వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం పెద్దపీట**

**వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసి సంపదగా మలచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా**







**నంద్యాల బ్యూరో, జూలై18( రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో రాష్ట్రవ్యాప్తంగా డ్రై ఘన వ్యర్థాలను సంపద సృష్టి కేంద్రాలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల జిల్లా బేతంచెర్ల నగర పంచాయతీ నుంచి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం బేతంచెర్ల నగర పంచాయతీలో రూ.91 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి గారు సంయుక్తంగా ప్రారంభించారు. రోజుకు 10 టన్నుల తడి, పొడి ఘన వ్యర్థాలను శాస్త్రీయంగా ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డ్రై వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ యంత్రాన్ని కలెక్టర్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి వాటిని సంపదగా మార్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెత్తను సమస్యగా కాకుండా విలువైన వనరుగా భావించి, రీసైక్లింగ్, ప్రాసెసింగ్ ద్వారా ఆదాయ వనరులను సృష్టించే దిశగా ప్రభుత్వం వినూత్న చర్యలు చేపడుతోందన్నారు. ఇటువంటి సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణానికి, పర్యావరణ పరిరక్షణకు, స్థానిక సంస్థల ఆదాయ వృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి యంత్రాంగాలు ఘన వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేసి, వ్యర్థాలను సంపదగా మలిచే దిశగా కృషి చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" లక్ష్యాలను సాధించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బేతంచెర్లను అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీఓ నరసింహులు, బేతంచెర్ల నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, బేతంచెర్ల మండల తహసీల్దార్ నాగమణి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నాస్కామ్ డిజిటల్ - ఏఐ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

**'డిజిటల్లీ స్కిల్ & ఇండస్ట్రీ రెడీ యూత్ - మిషన్' పోస్టర్ ఆవిష్కరణ**

**నంద్యాలలో ఉచిత డిజిటల్ స్కిల్ కోర్సుల నమోదు ప్రారంభం**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** ఉచిత నాస్కామ్ డిజిటల్ - ఏఐ నైపుణ్య కోర్సులను యువత సద్వినియోగం చేసుకొని తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. శనివారం ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న "డిజిటల్లీ స్కిల్డ్ & ఇండస్ట్రీ రెడీ యూత్ - మిషన్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి, జిల్లాలో యువత కోసం కోర్సుల నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన లక్ష మంది యువతకు పూర్తిగా ఉచితంగా డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ అందించడంతో పాటు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు పరిశ్రమల గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 17 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలన్నారు. అలాగే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు, విశ్వవిద్యాలయాల ప్రిన్సిపాళ్లతో సమన్వయం చేసి విద్యార్థుల నమోదు విస్తృతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెట్కూర్ సీఈఓ కె. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో "ఏఐ అసెండ్ ", "ఇంట్రడక్షన్ టు సైబర్ సెక్యూరిటీ" తదితర కోర్సులను నాస్కామ్ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ఒక ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌తో పాటు ఇద్దరు స్టూడెంట్ అంబాసిడర్లను నామినేట్ చేసి పంపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ అధికారి సోమ శివారెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా

# స్వర్గధామం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**ఏకలవ్య నగర్ హిందూ స్మశాన వాటికలో పారిశుద్ధ్య కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**స్వర్గధామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అంచనా నివేదిక సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులకు ఆదేశం**







**నంద్యాల బ్యూరో, జూలై 18 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని ఏకలవ్య నగర్ సమీపంలోని హిందూ స్మశాన వాటిక (స్వర్గధామం)లో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వయంగా పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొని స్మశాన వాటిక ఆవరణలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం, పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే చర్యలను పరిశీలించారు. అనంతరం స్వర్గధామం ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, స్వర్గధామంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను పరిశీలించి, నంద్యాల మున్సిపాలిటీ ద్వారా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన పనులపై అంచనా (ఎస్టిమేట్) సిద్ధం చేసి, దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్వర్గధామానికి ఎనిమిది వార్డుల ప్రజలు సేవలు పొందుతున్నారని, అక్కడికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రాంగణానికి ఆకర్షణీయమైన పెయింటింగ్‌లు వేయడం, విస్తృతంగా పచ్చదనం అభివృద్ధి చేయడం, అంత్యక్రియల కోసం ఆధునిక షెడ్ ఏర్పాటు చేయడం, మరుగుదొడ్లు, స్నాన సౌకర్యాలు కల్పించడం, ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించే శ్లోకాలతో కూడిన గోడ చిత్రాలు ఏర్పాటు చేయడం, అంత్యక్రియల సమయంలో అవసరమైన సమాచారాన్ని అందించే విధంగా సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది అని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను తమ దైనందిన జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని సూచించారు. స్వర్గధామం అభివృద్ధికి స్థానిక పెద్దలు, ప్రజల సహకారం, జిల్లా యంత్రాంగం సమిష్టి కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు, సిబ్బంది, స్థానిక పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com